గిడుటి రంగారావు

ఈ వాసన భరించలేను!

వసుంధర

సినిమా అంత బాగున్నట్లు లేదు. రమ నిరుత్సాహంగా చూస్తోంది. మధ్యమధ్య టైము కూడా చూసుకుంటోంది. హాల్లో జనం కూడా ఆట్టే వున్నట్లు లేదు. రమకు అటూ ఇటూ కూడా పక్క సీట్లు చాలా ఖాళీలున్నాయి.

ఇంటర్వెల్ అయిన అయిదు నిముషాలకు ఎవరిదో చేయి తన భుజంమీద పడినట్లై రమ వులిక్కిపడి పక్కకు చూసింది. తన పక్కన వున్నది తనవంటి ఆడపిల్ల కావడం ఆమెకు తృప్తిని కలిగించినా ఆశ్చర్యంమాత్రం ఇంకా తగ్గలేదు. ఆ ముఖం రమకు పరిచయమైనది కాదు.

"సినిమా బోరుగా లేదూ?" అందామె.

"చాలా..." అంది రమ ముక్తసరిగా.

"ఇంకా గంటకు పైగా హాల్లో కూర్చోవాలంటే బెంగగా లేదూ..."

"ఉంది. కానీ ఈ అనుభవం కొత్తకాదు నాకు. ఇలాంటి సినిమాలు చాలా చూశాను."

ఆమె నవ్వి- "నా పేరు కళ్యాణి. ఆర్ట్సు కాలేజీలో బియ్యే చదువుతున్నాను. మీ పేరు..." అనడిగింది.

"నా పేరు రమ. నేను ఇంటర్మీడియేట్ ప్యాసై టైపూ, షార్టూహ్యాండూ నేర్చుకున్నాను. ఉద్యోగ ప్రయత్నంలో వున్నాను..." అంది రమ.

"ఎంతకాలంగా?"

"ఆరునెల్లనించి..."

"నీకు నేను క్షణాలమీద ఉద్యోగం ఇప్పించగలను. సినిమా హాల్లోంచి బయటకు పోదామా?"

"నేను రాను..." అంది రమ.

కళ్యాణి నవ్వి — "అంతగా కావాలనుకుంటే ఈ సినిమా మళ్ళీ రేపు చూడొచ్చు. రఘుపతిగారీరోజు సాయంత్రం ఫారిన్ వెళ్ళిపోతున్నారు. మళ్ళీ రెండు నెలల దాకా రారు. ఆయన నాకు బాగా తెలుసు. ఆయన తల్చుకుంటే నీకు క్షణాలమీద నెలకు ఎనిమిదివందలు దొరికే ఉద్యోగం ఏర్పాటు చేయగలరు. అదృష్టం వదులుకోకు..." అంది.

రమ అనుమానంగా - "నువ్వెవరు?" అంది.

"నేను రఘుపతిగారి కంపెనీలో గుమస్తాని. నెలకు వెయ్యి రూపాయలు జీతం. ఏణ్ణర్థమయింది ఉద్యోగంలో జేరి. బాధ్యతలు తక్కువ. చాలా హాయిగా వుంటోంది ప్రాణం..."

రమ మెదడులో ఆశ తళుక్కుమంది "ఇప్పుడే వెడితే పని జరుగుతుందంటావా?"

"అని నా నమ్మకం!"

"అయితే పద..." అంది రమ.

2

రఘుపతికి నలభై ఏళ్ళుంటాయి. మనిషి చూడ్డానికి హుందాగా చాలా బాగుంటాడు. ఆ అందం డబ్బు తెచ్చినదే కావచ్చు. కానీ డబ్బు అందరికీ అందాన్ని తీసుకురాలేదుకదా!

రమకు ఆయన డిక్టేషన్ ఇచ్చాడు. తర్వాత ఆమె టైపు చేసి తెచ్చిన కాగితం చూసి - తృప్తిగా తలాడించి "అంతా బాగానే వుంది. నిన్నుద్యోగంలోకి తీసుకో వచ్చు. ఎటొచ్చీ జీతమెంతో ఫిక్స్ చేయాలి..." అన్నాడు.

రమ ఆనందంగా ఆయనవంకే చూస్తోంది.

"ఉద్యోగం ఇవ్వచ్చా అన్న విషయం నీ షార్టు హ్యాండు ప్రతిభనుబట్టి తేల్చేశాను. జీతమెంతివ్వాలన్న విషయం నీ హ్యాండుచూసి తేలుస్తాను..." అంటూ రఘుపతి చటుక్కున రమ చేయి పట్టుకున్నాడు. అప్రతిభురాలైన రమ విదిలించుకోనైనా లేదు. చేయిపట్టుకుని క్షణమాగి రఘుపతి చటుక్కున ఆమెను తన దగ్గరగా లాక్కున్నాడు.

అప్పటికి రమకు జరుగుతున్నది తెలిసి విదిలించుకోబోయింది. కానీ రఘుపతిది ఉక్కు కౌగిలివలె వుంది. రమ పిట్టలా వుంటుంది. కిచకిచలాడడం మినహా మరేమీ చేయలేదామె.

"సినిమా హాలు దగ్గర నిన్ను చూడగానే నా మనసు వశం తప్పింది. కళ్యాణిని పంపి నిన్ను రప్పించుకున్నాను. నీకిస్తానన్న ఉద్యోగం బూటకంకాదు. ఇప్పుడు నువ్వు నాకిచ్చే ఆనందాన్నిబట్టి నీ జీతం వుంటుంది. ఇందువల్ల నీకే నష్టమూ లేదు. జీవితం పూలబాటలా వుంటుంది.

నాకు నువ్వొక త్రివే కాదు. కాబట్టి నీతో ప్రతిరోజూ ఇలాంటి అవసరముండదు. ఎప్పుడో నెలకో రెండు నెలలకో ఇలా కలుసుకుంటాం. కలుసుకున్నప్పుడల్లా బోనస్ వుంటుంది. ఇష్టమైనన్నాళ్ళుద్యోగం చేయొచ్చు. తర్వాత మానేయొచ్చు. నీకూ నాకూ శాశ్వతానుబంధమేమీ లేదు కాబట్టి నువ్వు మామూలుగా పెళ్ళిచేసుకోవచ్చు. ఓ. కే" అన్నాడు రఘుపతి.

రమకు నోట మాటరాలేదు. కానీ గింజుకుంటోంది.

"నువ్విలా గింజుకోవడంవల్ల నా ఆవేశం పెరుగుతోంది. ఈ గదిలోంచి బయటపడడం అసాధ్యం. ఆలోచించుకుని మర్యాదగా లొంగిపో."

ఈ పర్యాయం రమ మాట్లాడింది "నీ ఉద్యోగం నాకక్కర్లేదు. నా దారిన నేను పోతాను. నన్ను వదలి పెట్టు..." ఆమె మాటల్లో అభ్యర్థనకంటే తిరస్కారమే ఎక్కువగా గోచరిస్తోంది.

"ఉద్యోగమక్కర్లేదంటే నాకభ్యంతరం లేదు. నిన్ను వదిలిపెట్టడం మాత్రం కల్ల..." అన్నాడు రఘుపతి.

రమ అతన్ని బలంగా వెనక్కునెట్టి తలుపుల దగ్గరకు పరుగెత్తింది. అయితే ఎంత ప్రయత్నించినా ఆమె తలుపులను తెరవలేకపోయింది. ఈలోగా రఘుపతి వచ్చి ఆమెను దొరకబుచ్చుకున్నాడు.

రమ దెబ్బతిన్న ఆడపులిలా విజృంభించింది. ఆయన్ని గోళ్ళతో రక్కింది. పళ్ళతో కరిచింది. ఆయన తనబట్టలు చింపుతుంటే ఆమె అతని వళ్ళంతా గీరేస్తోంది. మధ్య మధ్య బాధతో రఘుపతి ఆమెను వదిలిపెడుతున్నాడు. అప్పుడామె గది నాలుగు మూలలకూ పరుగెత్తి ఏదైనా

ఆయుధం కోసం వెతుకుతోంది.

ఆమెకు ఓ మూలగా వున్న ఇనుపఊచ కనబడింది. చటుక్కున దాన్నందుకుని గిరగిరా తిప్పుకుంటూ రఘుపతి మీదకు విసురుగా వచ్చింది.

ఆత్మరక్షణకోసం ఆయన అటూ ఇటూ తిరిగినా కొన్ని దెబ్బలు తినక తప్పలేదు. తగిలిన ఒకో దెబ్బా ఆయన కసిని పెంచుతున్నాయి. దెబ్బలబాధ భరించలేక ఆయన తెగించి ముందుకు వెళ్ళి రమ చేతిలోని ఇనుప ఊచను లాక్కోగలిగాడు. తన చేతిలోకి ఆ ఊచ రాగానే ఆయనకు అంతు తెలియని ఆవేశం కలిగి బలంగా దానితో రమ నెత్తిమీద మోదాడు.

రమ కెవ్వున కేకపెట్టి కుప్పలా కూలిపోయింది. ఆమె తల పగిలి రక్తం వరదలై ప్రవహించింది. అంతవరకూ తగిలిన దెబ్బలవల్లనో ఆ రక్తం చూపటం వల్లనో రఘుపతికి కూడా స్పృహ తప్పింది.

3

"ఇందాకట్నించి చూస్తున్నాను. ఎవర్నువ్వు? ఇక్కడే అలా కూర్చున్నావు. బయటకు పోతావా? లేక లోపల్నుంచి ఎవర్నయినా పిలవమన్నావా?" అంది కళ్యాణి. ఆమె అతన్ని సమీపించబోయింది కానీ అతని దగ్గర్నుంచి వచ్చే వాసన భరించలేక చటుక్కున ముక్కు మూసుకుని వెనకడుగు వేసింది.

అతను చూడ్డానికి యువకుడిలాగే వున్నాడుకానీ చాలా అపరిశుభ్రంగా వున్నాడు. బట్టలు మాసికలతో వుండడమే కాక మాసిపోయినవి కూడా. ఒళ్ళంతా మురికిగా ఉంది. జుట్టు చింపిరిది. గెడ్డం మాసింది.

"నా పేరు జోగినాథం. ఈ ప్రపంచంలోని కుళ్ళుకు

ప్రతినిధిని నేను. చూడ్డానికి శుభ్రంగా కనబడుతున్నా- నీకూ, నీ యజమానికీకూడా బోలెడంత కుళ్ళు వుంది. అలాంటి వాళ్ళదగ్గర దానం పట్టి వాళ్ళ కుళ్ళును తగ్గిస్తూ నా కుళ్ళును పెంచుకుంటూ వుండడం నా జీవనోపాధి. ఓ పది రూపాయలిస్తే నా దారిన నేను పోతాను...'' అన్నాడతను.

కళ్యాణి అతనికి చటుక్కున పది రూపాయలిచ్చింది. ఆ నోటు అందుకునేందుకు అతను దగ్గరకు రాగా ఆమె భరించలేకపోయింది.

''అడగ్గానే అడిగినంతా ఇచ్చినవాళ్ళ దగ్గర చాలా కుళ్ళుంటుంది. ఇక్కడ నా రేటు పెంచాల్సిందే - నేను మరికొంతసేపిక్కడ ఆగాల్సిందే'' అన్నాడు భోగినాథం నోటు తన పాకెట్లోకి పంపేస్తూ.

''ఏడిసినట్లుంది. వెడతావా వెళ్ళవా?'' అంది కళ్యాణి.

''చూడు. నువ్వెవరో పిల్లని తీసుకొచ్చావ్. ఆ పిల్ల ముఖం అమాయకంగా వుంది. ఆమెనా గదిలోకి పంపావు. అందులో రఘుపతి వుంటాడని నాకు తెలుసు. ఇలా చాలా కాలంగా జరుగుతోంది. ఆ గదిలోంచి ఎందరో ఆడపిల్లలు బయటకు రావడం నాకు తెలుసు. అతికొద్ది మంది మాత్రమే అందులోంచి నవ్వుతూ బయటకు వచ్చారు. ఎక్కువమందికి ఆ గది ఏడ్పునే మిగిల్చింది. దీన్నిబట్టి నీకేమైనా అర్థమయిందా?'' అన్నాడు భోగి నాథం.

కళ్యాణి భయంగా అతనివంక చూసి ''ఎవర్నువ్వు? ఇవన్నీ నీకెలా తెలిశాయి!'' అనడిగింది.

''పిల్లి కళ్ళుమూసుకుని పాలుతాగుతూ ఎవరికళ్ళా పడ

లేదనుకుంటుంది. నువ్వూ అంతే. ఇంతకీ నేనడిగిందానికి చెప్పలేదు. ఆ గదిలోంచి చాలా ఎక్కువమంది ఏడుస్తూ బయటకు రావడాన్నిబట్టి నీకేమనిపిస్తోంది.. ”

“ఏమీ అనిపించడంలేదు...”

“లోకంలో నీలాంటి ఆడాళ్ళు చాలా తక్కువమంది ఉన్నారని గ్రహించాలి నువ్వు. నీకు డబ్బు సంతోషాన్నిస్తుంది. డబ్బుకోసం నువ్వేమైనా చేయగలవు. శరీరాన్ని కూడా ఎవరికైనా సమర్పించుకోగలవు. కానీ అలాగని ఇతరులకన్యాయం చేయడం పెద్ద నేరం. నీలాంటి నేరస్థుల్ని నేను క్షమించను...”

“క్షమించక ఏం చేస్తావ్?” అంది కళ్యాణి వెటకారంగా.

జోగినాథం రెండంగలువేసి కళ్యాణిని సమీపించి ఆమెను గట్టిగా కౌగలించుకున్నాడు. కళ్యాణికిది ఊహించని పరిణామం కావడంవల్ల తెల్లబోయినా - మితిమీరిన జుగుప్సాభావంతో - కెవ్వుమని కేక వేసింది. జోగినాథం ఆమె పెదవులపైన ముద్దుపెట్టుకుని వదిలేశాడు. తర్వాత రెండడుగులు వెనక్కువేశాడు.

కళ్యాణి కట్టుకున్న తెల్లని చీర మాసిపోయింది. పచ్చటి ఆమె శరీరం మాసిపోయింది. ఆమె వంటికున్న సుగంధ పరిమళం చాలావరకూ హరించుకుపోయింది. ఆమె పెదవుల తీపి హరించుకుపోయింది.

ఏదో భయంకరమైన అనుభూతికి లోనైన దానిలా కళ్యాణి శరీరం కంపించిపోతోంది. పెదవులు వణుకుతున్నాయి. చూపులు భయం భయంగా వున్నాయి.

“శీలమంటే అదే! ఇష్టంలేని పురుషుడిని కలిసిన స్త్రీ ఇప్పుడు నువ్వు పొందిన అనుభూతున్నే పొందుతుంది.

ఆమె శరీరం ఇదేవిధంగా మలినపడినట్లు భావిస్తుంది. ఆ గదిలో వున్న అమాయకురాలి గతి గుర్తు తెచ్చుకో. నీకూ నాకూ మధ్య ఒక్క క్షణమే. ఆమె అయితే చాలా సేపటి్నుంచి వుండక్కడ..."

"రఘుపతికీ నీకూ పోలికేమిటి? త్వరగా పోతావని నీకూ పది రూపాయలూ ఇచ్చేశాను. తక్షణం అవతలికేనా పో — లేదా నా పదీ నాకిచ్చేయ్..." అంది కళ్యాణి.

"తీసుకున్న డబ్బు వెనక్కివ్వడం నా కలవాటు లేదు. నువ్వు చేసిన చాలా పాపాల్లోంచి ఓ పదిరూపాయల పాపాలు పోయ్యాయనుకో..." అన్నాడు జోగినాథం.

"వెడతావా వెళ్ళవా?" తీవ్రంగా అడిగింది కళ్యాణి.

"ఇక్కడుండడం నా అభిమతంకాదు. ఎటొచ్చీ ఆ గదితలుపులు తెరుచుకున్నాక వెడతాను. మరోలా అనుకోకు..." అన్నాడు జోగినాథం.

కళ్యాణికి ఏం చేయాలో ఏం మాట్లాడాలో తోచక అలా అతనికేసే చూస్తూ వుండిపోయింది. తలుపులు మాత్రం ఓ పట్టాన తెరుచుకోవడం లేదు. అలా సుమారు రెండుగంటలసేపు ఎదురుచూశాక ఆ గది తలుపులు తెరుచుకున్నాయి.

4

"కళ్యాణీ! రమను చంపేశాను..." అన్నాడు రఘుపతి - గది తలుపులు తీసుకుని బయటకు వస్తూ. అక్కడ జోగినాథం వుంటాడని అనుకోనూలేదు. ఆ మాటలన్నప్పుడాయన జోగనాథాన్ని చూడనైనా లేదు.

ఆయన మాటలు విని కళ్యాణి ముందు ఉలిక్కిపడినా అక్కడ జోగినాథమున్నాడన్న విషయాన్ని రఘుపతికి తెలియజేయడం తన బాధ్యతగా గుర్తించి, కనుసైగతో

ఆ విషయం తెలియజేసింది.

కాస్త పక్కగా వున్న జోగినాథాన్ని ఆయన అప్పుడే చూసి గతుక్కుమన్నాడు. అయితే జోగినాథం వేషం చూడగానే వెంటనే తమాయించుకుని "ఒరేయ్- ఎక్కడా నువ్వు - ఇలారా" అన్నాడు.

జోగినాథం నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఆయన ముందుకు వెళ్ళాడు. ఏమీ మాట్లాడకుండా కొంత దూరంలో ఆగి - "ఇంకాస్త ముందుకు రానా - ఇక్కడ ఆగిపోనా?" అన్నాడు.

రఘుపతి చటుక్కున ముక్కు మూసుకుని - "ఆగు!" అన్నాడు. వెంటనే జోగినాథంకూడా ముక్కు మూసుకుని "ఏవాసనైనా భరించగలను నేను. కానీ రక్తం వాసన భరించలేను" అన్నాడు.

రఘుపతి కళ్యాణివంక చూసి "ఈ పిచ్చివాడిక్కడ ఎంతసేపట్నించి వున్నాడు?" అనడిగాడు.

"వాడు పిచ్చాడిలా కనబడ్డంలేదు. చాలా తెలివైన వాడిలా, ప్రమాదకరమైన వాడిలా కనిపిస్తున్నాడు..." అంది కళ్యాణి.

రఘుపతికి కళ్యాణి మాటల్లో నమ్మకం కుదరలేదు— "ఒరేయ్ నువ్వు గోతులు తీయగలవురా?" అనడిగాడు.

"మనిషికి ముందా, వెనకా?" అన్నాడు జోగినాథం.

"అడుగున... గొయ్యి తీశాక సరాసరి మనిషి అందులో కప్పబడి పోవాలి..." అన్నాడు రఘుపతి.

"చేతకాదు..." అన్నాడు జోగినాథం — "మనం ఇంకొకళ్ళకోసం తీసే గొయ్యి మనకోసం ఇంకొకళ్ళ చేత తీయిస్తుందని నాకు తెలును..."

"వెధవ కబుర్లు మాని చెప్పిందిచెయ్యి. ఓ రెండ్రోంధ

లిస్తాలే - గొయ్యి తీస్తావా?'' అన్నాడు రఘుపతి.

''నేను డబ్బు తీసుకునేది పాపాలు మాపడానికేగానీ చేయడానికి కాదు. అయినా నువ్వింకా ఆరోగ్యంగానే వున్నావుకదురా - నీకు గొయ్యెందుకు?''

''రా...రా అంటావా నన్ను...'' రఘుపతి కోపంగా అన్నాడు.

''అదేమిట్రా - నువ్వు నన్ను రా అంటే నేను కోపగించుకోలేదు. నాపాటి మర్యాద తెలియదురా నీకు'' అన్నాడు జోగినాథం.

''కళ్యాణీ - నువ్వు చెప్పిందే నిజం. వీణ్ణి బ్రతకనివ్వకూడదు...'' అన్నాడు రఘుపతి.

''అలా అనేస్తే ఎలాగరా - నువ్వో అమ్మాయిని చంపావు. అందుకు నీకు ఉరిశిక్ష పడాలికదా - అది నావల్లనే జరగాలి కదా...''

రఘుపతికి తను చేసిన హత్య విషయం గుర్తుకొచ్చింది.

అది రఘుపతి ప్రత్యేకంగా కట్టుకున్న ఇల్లు. ఊరికి అయిదారు మైళ్ళ దూరంలోవుంది. సాధారణంగా అక్కడికెవరూ రారు. అక్కడింకెవరూ వుండరు. తనకున్న స్త్రీ వ్యసనాన్ని రఘుపతి ఈ ఇంట్లో తీర్చుకుంటున్నాడు. రమను అతను చంపినది సౌండ్ ప్రూఫ్ గది.

ఆవేశంలో రమను కొట్టి తనూ పడిపోయాక కాసేపటికి రఘుపతికి మెలకువవచ్చింది. జరిగిందేమిటో గ్రహించి బయటకు వచ్చేసరికి పిచ్చాడిలాంటి మనిషి తారసపడ్డాడు.

''ఎవర్రా నువ్వు. అలుసిచ్చినకొద్దీ తెగ వాగుతున్నావ్?'' అన్నాడు రఘుపతి కోపంగా.

''ఒరేయ్_అలుసు నువ్విచ్చేదేంలేదు. నేను తీసుకున్నాను. నా పేరు జోగినాథం. చాలాకాలంగా నీ విషయం కని

పెడుతున్నాను. నీ దగ్గర్నుంచి బయటపడ్డ ఆడపిల్లల్ని కలుసుకుని మాట్లాడేను. వాళ్ళెవ్వరికీ నీమీద పగతీర్చు కునే ధైర్యంలేదు. అన్నివిధాలా తాము నష్టపోయినా నాకు సహకరించమన్నారు. అయినా నా ప్రయత్నం మానలేదు. నువ్వు సంఘానికి చీడపురుగువి. నిన్ను ఏరే యడం నా అభిమతం.''

''వీడికి పిచ్చో వెర్రో తెలియడంలేదు కళ్యాణీ!'' అన్నాడు రఘుపతి.

''కళ్యాణీ!'' అన్నాడు జోగినాథం- ''పిచ్చి నా క్కాదు, ఈ రఘుపతికి. వెర్రి నాక్కాదు, నీకే! తన మాటకంగీకరించని అమ్మాయిని చంపేసిన రఘుపతిది పిచ్చి. అలాంటివాడెప్పుడో అప్పుడు నిన్నూ చంపక పోడని గ్రహించని నీకు వెర్రి. మీ ఇద్దరిమధ్యా నేనుండ దల్చుకోలేదు. ఆ అమ్మాయి పేరు రమ అని తెలిసింది కదా-చూడండి తర్వాత ఏం చేస్తానో!''

జోగినాథం ఆక్కణ్ణించి కదిలాడు. రఘుపతి చటు క్కున నాలుగంగల్లో జోగినాథాన్ని కలుసుకుని పట్టు కుని-''ఎక్కడికి పోదామనుకున్నావ్ రా-'' అన్నాడు.

జోగినాథం బలంగా రఘుపతిని విదిలించుకున్నాడు. రఘుపతి క్రింద పడిపోతూ అతని బలానికి ఆశ్చర్య పడ్డాడు.

''ఒరేయ్ రఘుపతీ! ఖర్చు తక్కువ, ఆదాయ మెక్కువ-అందుకే నీ దగ్గరికి డబ్బు పేరుకుపోతోంది. అలాగే నా దగ్గర బలంకూడా పేరుకుపోతోంది. శారీరక బలంతోపాటు నైతికబలంకూడా ఉంది నా దగర...'' అన్నాడు జోగినాథం.

''పదివేలిస్తాను. హత్యసంగతి మర్చిపో,'' అన్నాడు

రఘుపతి.

"అలా దారికి రా. మర్చిపోడానికి పదివేలుచాల్తుందో చాలదో తెలుసుకుందుకోసారి హత్యా ప్రదేశాన్నీ, హాతు రాలినీ చూడాలి..." అన్నాడు జోగినాథం.

రఘుపతి, కళ్యాణి, జోగినాథం— ముగ్గురు గదిలోపలకు వెళ్ళారు. అక్కడి దృశ్యం భయంకరంగా ఉంది. కళ్యాణి అయితే కెవ్వుమని కేక వేసింది.

"పాతికవేలకు చెక్కు రాసియ్యి. అదికాక ఇంకా రెండు మూడు బిల్సు వస్తాయి-రెండు మూడు రోజుల్లో. అవికూడా నువ్వే ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఎక్కువ సేపు బేరమాడితే ఇక్కడి దృశ్యం శాశ్వతంగా నా మెదడులో నిలిచిపోతుంది. అప్పుడు మరిచిపోవడం కష్టం..." అన్నాడు జోగినాథం.

రఘుపతి మాట్లాడకుండా అక్కడున్న ఓ టేబిల్ సొరుగు లాగి చెక్కు బుక్కు పెన్నూ తీశాడు. జోగినాథం పేరున పాతికవేలకు చెక్కు రాసిచ్చాడు. అదయ్యేవరకూ అతన్నీ అతని చర్యలను వెయ్యికళ్ళతో కనిపెడుతున్నాడు జోగినాథం.

"ప్రమాదమెలాగూ జరిగిపోయింది. నిన్ను శిక్షించినా పోయిన రమ బ్రతకదు. నా బోటి పుణ్యాత్ముడికివ్వడం వల్ల నీ పాపాలు కొన్ని పోయాయి. ఇక మీద పాపాలు చేయకు..." అన్నాడు జోగినాథం. తర్వాత అతను మెరుపు వేగంతో అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

జోగినాథం వెళ్ళగానే రఘుపతి ఎక్కడికో ఫోన్ చేసి ఏమో చెప్పాడు.

5

"వెధవ ఏమనుకున్నాడో గానీ మననేం చేయగలడు?" అని నవ్వాడు రఘుపతి.

కళ్యాణి తనూ శృతి కలిపింది.

"అక్కడున్న ఆ ఇల్లు మన పేరున లేదు. అది నాదని చాలామందికి తెలియదు. అక్కడ హత్య తాలూకు ఆన మాలుకూడా లేదు. ఈవేళ ఎవరైనా చెక్కు మార్చుకునేందుకు బ్యాంకుకు వస్తే ఆపి వుంచమని చెప్పాను. ఆ విషయంలో పోలీస్ రిపోర్టుకూడా ఇచ్చాను - ఓ దొంగ వెధవ నన్ను బెదిరించి బలవంతంగా చెక్కు రాయించి తీసుకున్నాడని! ఇప్పుడు వాడేం చేస్తాడు?"

కళ్యాణి చిన్నగా నవ్వి - అసలు సంగతి మీ రాలోచించడం లేదు. అసలా రమ ఎవరో తెలియలేదా ముందు" అంది.

"అది నిజమే! అదెవత్తో అనామకురాలయుంటుంది. దాని ఆచూకీ తెలుసుకోడానికే సాధ్యంకాకపోవచ్చు ఈ నగరంలో. అయినా ఆ వెధవ ఇంకేమీ చేయడని నా ఉద్దేశ్యం. పాతిక వేలకు చెక్కు చూస్తే కళ్ళు చెదిరిపోయాయి వాడికి. ఏదో ఓ రోజున ఆ చెక్కు తీసుకుని బ్యాంకుకు వెడతాడు. పోలీసులకు దొరికిపోతాడు." గర్వంగా నవ్వాడు రఘుపతి.

అంతలో బల్లమీద టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి - "హలో!" అన్నాడు రఘుపతి.

"నేనండి - వార్తాజ్యోతి పత్రిక ఆఫీసునుంచి మాట్లాడుతున్నాను. తమరు నిన్నరాత్రి ఇచ్చిన ప్రకటన పేపర్లో వేశామండి. బిల్లు మీ పేరున వ్రాయాలా, మీ కంపెనీ పేరున వ్రాయాలా అని అనుమానం వచ్చి మానేజరుగారు మీకు ఫోన్ చేయమన్నారు."

"ఏం ప్రకటన అది - కంపెనీకి సంబంధించిందా... లేక...."

"కంపెనీకి సంబంధించిందవునో కాదో తెలియదండి..."

"అయితే పేపరు చూసి చెబుతాను. మళ్ళీ ఫోన్ చేస్తాను..." అన్నాడు రఘుపతి.

"ఎందుకలెండి- ఓ అరగంట పోయాక నేనే మళ్ళీ ఫోన్ చేస్తానెండి..."

రఘుపతి ఫోన్ పెట్టేసి, "వార్తాజ్యోతి వచ్చిందా?" అన్నాడు.

కళ్యాణి ఆ గదిలోంచి బయటకు వెళ్ళి ఓ అయిదు నిముషాల్లో తిరిగివచ్చింది. ఆమె చేతిలో వార్తాజ్యోతి దిన పత్రిక ఉంది.

రఘుపతి ఆత్రుతగా పేపరు అందుకుని త్వరగా తిరగేశాడు. ఆయనకు కావలసిన సమాచారం రెండో పేజీలో దొరికింది. అది చదివి ఉలిక్కిపడ్డాడాయన- "కళ్యాణీ! ఇది చదువు..."

కళ్యాణికూడా అది చదివి ఉలిక్కిపడింది.

అందులో రమ అనే అమ్మాయి గురించిన వర్ణనఉంది. ఆ అమ్మాయి తప్పిపోయిన పక్షంలో రఘుపతి వారికి సాయపడగలడని వుంది. రఘుపతి చిరునామా ఉంది.

"ఇది జోగినాథం పనే!" అంది అప్రయత్నంగా కళ్యాణి.

"కానీ- వెధవ- ఇంతపని చేస్తాడని అనుకోలేదు..." అన్నాడు రఘుపతి. ఆయన ముఖంలో కోపం, విసుగుతో పాటు భయంకూడా కనబడింది.

"ఈ పర్యాయం వ్యవహారమంతా ఇలాగే వుంది..." అంది కళ్యాణి.

"అవును. ప్రతిఘటన ఎరుగని నన్ను రమ ప్రతిఘటిం

చింది. ఎన్నడూ లేనిది నేను హత్య చేయాల్సి వచ్చింది. ఓ పిచ్చి వెధవ నన్ను వీధిలో పెట్టడానికి ప్రయత్నిస్తు న్నాడు..." అన్నాడు రఘుపతి బాధగా.

కళ్యాణికీ భయంగానే వుంది. ఆయన పాపాల్లో ఆమెకూ చాలా భాగం వుంది. ఏదో ఓ రోజున పాపం పండుతుందంటారు. కొంపదీసి తమకూ అలాగే పాపం పండలేదు గదా!

6

"నా పేరు చొక్కారావు. రమ నా చెల్లెలు..." అన్నాడతను.

"అయితే..." అన్నాడు రఘుపతి.

"నిన్న మధ్యాహ్నం సినిమాకని వెళ్ళిన రమ మాయ మయింది. ఏమయిందో తెలియక హడలి చస్తున్నాం. ఈ రోజు ఉదయం పేపర్లో మీరు చేసిన ప్రకటన చూశాక కొండంత ధైర్యం వచ్చింది. ఉరకలు పరుగులమీద ఇక్క డకు వచ్చాను..." అన్నాడు చొక్కారావు.

"రమ ఫోటో వుందా మీ దగ్గర?"

చొక్కారావు వెంటనే జేబులోంచి ఫోటో తీసి ఇచ్చాడు. రఘుపతి దాన్నందుకుని చూసి తడబడ్డాడు. అద్భుత సౌందర్యంతో విరాజిల్లుతున్న ఆ అప్సరసను నిన్నటి సాయంత్రం ఒక్కపర్యాయమైనా అనుభవించ కుండా చేజేతులా చంపాడు తను. రఘుపతికి మళ్ళీ మరొక్కసారి బాధ, భయం కలిగాయి.

"చెప్పండి_ రమకేమయింది?" అన్నాడు చొక్కా రావు.

"మీ ఇంట్లో ఎంతమంది వున్నారు?"

"నేను, నా భార్య, రమ..."

"రమ తలిదండ్రులు ఎక్కడున్నారు?"

"రమకు నేను, నాకు రమా తప్ప ఇంకెవ్వరూ లేరు. మా తలిదండ్రులు చనిపోయి చాలాకాలమైంది..." అన్నాడు చొక్కారావు.

"ఏం చేస్తున్నారు మీరు?"

"ఓ కంపెనీలో గుమస్తా ఉద్యోగం. రమకు పెళ్ళి చేయాల్సిన బాధ్యత నామీద వుంది. దాన్ని ఉద్యోగంలో జేర్పించి_ ఆ డబ్బును వేరే వేసి ఓ రెండేళ్ళలో పెళ్ళి చేయాలనుకుంటున్నాను."

"ఏం చదివారు మీరు?"

"బియ్యే పాసయ్యాను..."

"మిస్టర్ చొక్కారావ్!" గంభీరంగా అన్నాడు రఘుపతి_ "రమను గురించి నాకేమీ తెలియదంటే నమ్ముతారా?"

చొక్కారావు దెబ్బతిని, "మరి... వార్తాజ్యోతి ప్రకటన..." అన్నాడు.

"నేను డబ్బుగలవాణ్ణి. నగరంలో పరపతి గలవాణ్ణి. నన్నల్లరిపెట్టాలనీ, నా పరువు గంగపాలు చేయాలనీ అనుకునే కిట్టని వాళ్ళు చాలామంది వున్నారు. అలాంటి వాళ్ళలో ఎవ్వరో రమను మాయంచేసి ఈ విధంగా ప్రకటన చేశారు. అది నా దురదృష్టం. మీరు నాకో సాయంచేస్తే మీకు నేనో సాయం చేయగలను..."

"చెప్పండి..." అన్నాడు చొక్కారావు.

"మీకు నా కంపెనీలో ఆఫీసరుద్యోగం ఇప్పిస్తాను. పదివేల రూపాయల క్యాషు ఇస్తాను. మీరు రమను గురించి మరచిపోవాలి. ఎవరైనా ఆమె గురించి అడిగితే

ఊళ్ళు చూడ్డానికి వెళ్ళిందని చెప్పాలి..." అన్నాడు రఘుపతి.

చౌకార్రావు తటపటాయించాడు.

"ఎప్పుడైనా రమ తిరిగివస్తే ఆమెకూడా మంచి ఉద్యోగం ఇప్పిస్తాను. తగిన వరుణ్ణి మీరెన్నిక చేస్తే నా ఖర్చులతో ఆ పెళ్ళి జరిపిస్తాను. కానీ ఈ విషయంలో ఏమీ తెలియని నన్ను మరి మీరు బాధించకూడదు..."

చౌకార్రావు కాసేపు ఆలోచించి—"ఈ పరిస్థితుల్లో మీరు కానీ నేను కానీ అంతకంటే చేయగలిగిన దేముంది?" అన్నాడు.

"రమ ఆచూకీ తెలుసుకునేందుకు నేనుకూడా ప్రయత్నిస్తాను. ఈ ఫోటో నాదగ్గర వదిలి వెళ్ళండి. రేపు మీ పేపర్సుతో నన్ను కలుసుకుంటే ఉద్యోగం విషయం ఫైనలైజవుతుంది. ఇప్పుడీ పదివేలూ తీసుకువెళ్ళండి..." అన్నాడు రఘుపతి.

చౌకార్రావు డబ్బు అందుకుని లెక్కపెట్టుకుని లేచాడు.

"మిస్టర్ చౌకార్రావ్! నా పరువు నిలబెట్టుకోవడం కోసం మీకుపకారం చేస్తున్నాను. మీ కారణంగా అది నిలబడకపోతే నేను అపకారంకూడా చేయగలను. నా మనుషులు నిన్నూ నీ నిజాయితీని కఠినంగా పరీక్షిస్తారు. ఆ పరీక్షకు తట్టుకుని నిలబడ్డాకనే ఉద్యోగపు ఆర్డరు నీ చేతికొస్తుంది..." అన్నాడు రఘుపతి.

7

"ఏమండోయ్— కాస్త ఆగండి!" అన్న కేకవిని చౌకార్రావు చిరాగ్గా ఆగాడు.

అతనికి తొందరగా ఇంటికి వెళ్ళాలని వుంది. చెల్లెలు

కనబడ్డంలేదన్న విచారం కంటె అనూహ్యంగా పదివేలు వచ్చిన సంతోషం ఎక్కువగా వుందతనికి. అంతేకాక ఆఫీసరుద్యోగం దొరకబోతోంది! ఇవన్నీ భార్యకు చెప్పాలని అతను ఆత్రుతపడుతున్నాడు. ఇప్పుడిలా పిలిచిన వ్యక్తికూడా ఎరిగున్నవాడిలా లేడు. ఆకారానికి పిచ్చివాడి లాగున్నాడు.

అతను పరుగెత్తుకుంటూ వచ్చి- "నా పేరు జోగినాథం! మీరు రఘుపతిగారింటికి వెళ్ళడం చూశాను. బహుశా మీరు రమ అన్న అయుండాలి. మీ పేరు తెలుసుకోవచ్చా?" అన్నాడు.

"చొక్కారావు..." అన్నాడతను.

"సరే- చొక్కారావుగారూ- మీకు మీ చెల్లెలి వివరాలు తెలిశాయా? రఘుపతి ఏం చెప్పాడు మీకు?" అన్నాడు.

"నా చెల్లెలి గురించి ఆయనేం చెబుతాడు?" అన్నాడు చొక్కారావు.

"ఏదో చెబుతాడని కాకపోతే ఎందుకు వెళ్ళడం?" అన్నాడు జోగినాథం.

"నా చెల్లెలు ఊళ్ళు తిరుగుతోంది. అది మాయం కావడమేమిటని కంగారుపడి వివరాలు తెలుసుకుందుకు వెళ్ళాను. తీరా చూస్తే పేపర్లో ప్రకటన ఆయన చేసింది కాదుట-ఎవరో కిట్టనివాళ్ళు చేశారుట..."

"అలాగని ఆయన చెబితే నమ్మేసి వచ్చేశారా? బాగానే వుంది..." అన్నాడు జోగినాథం- "మీ చెల్లెలు ఊరికెప్పుడెళ్ళింది?"

"చాలా రోజులయ్యింది!"

"మీరు నిజం చెబుతున్నారో అబద్ధం చెబుతున్నారో

తెలియదు కానీ- మీ చెల్లెలు రమ నిన్న ఈ ఊళ్ళోనే ఉంది..."

"మీరెవరో నాకు తెలియదు. మీరు చెప్పేది నా కర్థంకావడంలేదు. నాకు అవతల పనులున్నాయ్. వస్తాను..." అంటూ కదిలాడు చొక్కారావు.

"నేనూ వస్తున్నానుండండి..." అంటూ అతన్ననుసరించాడు జోగినాథం.

"ఎందుకు?"

"మీ ఇంటికివచ్చి మీ చెల్లెలు ఫోటో చూసి వెడతాను..." అన్నాడు జోగినాథం.

"ఫోటోకోసం ఇంటిదాకా ఎందుకు? జేబులో అవి ఓ నాలుగు వేసుకునే వచ్చాను. ఉద్యోగాలకి అప్లికేషన్సు పెట్టడానికి అది ఇంట్లో ఎప్పుడూ ఫోటోలు సప్లయిచేస్తుంది..." అంటూ ఓ ఫోటో తీసి జోగినాథానికిచ్చాడు చొక్కారావు. ఆ సమయంలో జోగినాథం అతనికి మరీ దగ్గరగా వచ్చాడేమో వాసన భరించలేక ముక్కుమూసుకున్నాడు.

జోగినాథం ఆ ఫోటోని చూసి- "మీరు నిజంగా ఈమెకు అన్నయేనా?" అన్నాడు.

"అవును ఏం?"

"అయితే ఈమెకు పట్టిన గతి తెలుసుకోవాలని లేదా?"

"లేదు..."

"నిన్న ఈమెను రఘుపతి దారుణంగా హత్య చేశాడన్న విషయం తెలిసేక కూడా ఇలాగే అంటారా మీరు?"

చొక్కారావు క్షణం మాత్రం తడబడ్డాడు. అతనికి

రఘుపతి హెచ్చరిక గుర్తు వచ్చింది. ఆయన పెట్టే పక్కి ళ్లులకు తట్టుకుంటేనే తనకు ఆఫీసరుద్యోగం లభిస్తుంది!

"రఘుపతిగారి గురించి మీరేం చెప్పినా నేను నమ్మను..." అని క్షణంకూడా ఆగకుండా అక్కణ్ణించి కదిలాడు.

జోగినాథం చటుక్కున తన ముక్కు మూసుకుని- "అబ్బ-స్వార్థపు వాసన నేను భరించలేను..." అని చౌకార్రావుకు వినబడేంత గట్టిగా అన్నాడు. చౌకార్రావు పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు.

8

"రఘుపతి గురించి నాకు బాగా తెలుసు. కళ్యాణి సాయంతో ఆయన ఎందరో ఆడపిల్లల మానప్రాణాలు బలిగొంటున్నాడు. చాలాకాలంగా ఈ విషయాన్ని గమనిస్తూ నేను ఏమీ చేయలేకపోతున్నాను. డబ్బుతో ఆయన మానాన్నీ, బంధుత్వాన్నీ, మమకారాన్నీ, అధికారాన్నీ, సాక్ష్యాల్నీ-అన్నింటినీ కొనేస్తున్నాడు. ఆయన వల్ల నష్టపోయిన వాళ్ళుకూడా నాకు సాయపడ్డంలేదు. అలాంటివాడి బ్రతుకు బయటపెట్టకపోతే ఇంకా ఎందరివో జీవితాలు నాశనంకాక తప్పదు..." అన్నాడు జోగినాథం.

శాంతి అదోలా నవ్వి- "మీరివన్నీ ఎందుకు చెబుతున్నారో తెలియదు. ఏదో గుట్టుగా సంసార చేసుకుంటున్నవాళ్ళం. మాకు పెద్దవాళ్ళ గొడవలనవసరం. ఇంక రమ సంగతంటారా- అది మా స్వవిషయం. మాకు లేని బాధ మీకనవసరం. మీకేమైనా అనుమానాలుంటే రఘుపతిగారిమీద పోలీస్ రిపోర్టిచ్చుకోండి-" అంది.

"సంఘంలో కుళ్ళు కడగాలనుకుంటే ముందు-మీ

వంటిమీద కుళ్ళు కడుక్కోండి. వాసన భరించడం కష్టంగా వుంది'' అన్నాడు చౌకార్రావు.

జోగినాథం బాధగా నవ్వి— ''నా వంటిమీద కుళ్ళు భరించలేనిదైనా—ప్రమాదకరమైనది కాదు. ఈ సంఘంలోని కుళ్ళుకు నేనొక ఉదాహరణను. ఏదైనా దీక్షబూనినపుడు నేను స్నానం మానేస్తాను. గెడ్డం గీయను. బట్టలు మార్చను. అనుకున్నది జరిగాక నే నా స్నానం. రఘుపతికి శిక్షపడేవరకూ—ఈ సంఘంలాగే నేనూ మురికిని భరించక తప్పదు'' అన్నాడు.

''పోనీ రఘుపతిగారు దుర్మార్గుడే అనుకుందాం... ఆయన తప్ప మిగతా వారంతా మంచివారేనంటారా?'' అంది శాంతి.

''కాదు. అలాంటివారిని ఒక్కొక్కరినే ఏరివేయడం నా కోరిక'' అన్నాడు జోగినాథం.

''ఈ విషయంలో పనిగట్టుకుని మా ఇంటికి వచ్చినందుకు నా ధన్యవాదాలు. కానీ నేను మీకేవిధంగానూ సాయపడలేను సరికదా మరో పర్యాయం మా ఇంటికి వస్తే నాకు రమ అనే చెల్లెలే లేదనవలసి వస్తుంది...'' అన్నాడు చౌకార్రావు.

జోగినాథం ఉద్రేకంగా లేచి—''అనవలసి రావడమేంకర్మ—రమ అనే చెల్లెలు మీకింక ఎలాగూ లేదు...'' అన్నాడు. తర్వాత నెమ్మదిగా తమాయించుకుని— ''ఆపదలోవున్న ప్రతి ఆడదీ నాకు చెల్లెలు. కానీ అన్నగా నా సాయాన్నింతవరకూ ఎవరూ అంగీకరించలేదు. రమ ఈ లోకంలో ఉండివుంటే తనూ నా సాయం వద్దనేదేమో! ఆమె అసహాయతనాధారం చేసుకుని నేను ఆమెకు అన్నను కాదల్చుకున్నాను. రమ అన్నగా

రఘుపతి నెదిరించ దల్చుకున్నాను...'' అని అక్కణ్ణించి కదిలాడు.

''ఆఫీసరుద్యోగం వచ్చేదాకా ఇంకా ఇలాంటి వెన్ని పరీక్ష లెదుర్కోవాలో!'' అన్నాడు చౌకార్రావు, భార్యతో.

9

ఆమె ఒకసారి చుట్టూ చూసింది.

ఎదురుగా నీలాకాశం, పైన నీలాకాశం, క్రింద దారుణ మైన అగాధం మనసులో దేవుడిని స్మరించుకుని క్రిందకు దూక బోయింది.

చటుక్కున ఎవరిదో చేయి ఆమెను ఆపింది. అదే చేయి ఆమెను బలంగా వెనక్కు లాగింది.

ఆమె పెనగులాడడానికి ప్రయత్నించలేదు. అగా ధంలో దూకబోయే ముందున్న నిర్ణయం ఏదో హస్తం తన్నాపేసరికి బలహీనమై పోయింది. తనా అగాధంలో దూకి వుంటే?

తలచుకుని వణికి పోయిందామె.

''నిన్ను నేను చాలా దూరంనుంచి అనుసరించి వస్తు న్నాను. ఇలాంటి ప్రయత్న మేదో చేస్తావన్న అను మానం బజారులో నీ ముఖం చూసినప్పుడే కలిగిందినాకు. చావాలని ఎందుకను కున్నావ్?'' అన్నాడతను.

''బ్రతక లేక!'' అందామె.

ఆమె జీవితంలో వంచింప బడింది. ఒక మోసగాడు ఆమెచుట్టూ తిరుగుతూ-పెళ్ళి చేసుకుంటానని ఆశ పెట్టాడు. నిన్నటిదాకా అతన్ని నమ్మింది. నిన్ననే ఇద్దరూ ఒక టయ్యారు. ఈరోజు వాడి అసలురంగు బయటపడింది.

ఆమెకు జీవితంలో ఎవ్వరూలేరు. గత రెండు సంవత్స

రాలుగా ఒక మనిషి చుట్టూ తన ఆశలన్నింటినీ అల్లుకుంటూ వచ్చిందామె. ఈ రోజవన్నీ భగ్నమైపోయాయి. జీవితం మీద విరక్తి కలిగిందామెకు.

"బాగుంది. ఓ మోసగాడికోసం విలువైన నీ ప్రాణాలు తీసుకుంటావా? అలాంటి మోసగాళ్ళకు బుద్ధి చెప్పడం నీ బాధ్యత కాదా? ఆ విధంగానైనా నీ వంటి మరి కొంతమంది ఆడవాళ్ళు రక్షించబడతారు కదా!"

"మీ రెవరు?"

"నా పేరు జోగినాథం. రఘుపతి అనే పేరుగల పెద్ద మనిషి అన్యాయాలను బయటపెట్టడం నా ధ్యేయం. ఆయన మూలంగా ఎందరో ఆడపిల్లల శీలం హరించుకుపోతోంది. అయినా నా కెవ్వరివద్ద నుంచీ సహకారం లభించడం లేదు."

"నా పేరు కోమల. నేను మీ కేదైనా సాయపడగల నేమో చెప్పండి!"

"సాయపడగలవు. నువ్వు చూడ్డానికి చాలా అందంగా వున్నావు, కళ్యాణి కంట బడ్డావంటే ఆమె నిన్ను రఘుపతి వద్దకు చేర్చుతుంది. నువ్వూ రఘుపతీ ఓ గదిలో వుండగా - నువ్వాయన్ను ప్రతిఘటిస్తూండగా - పోలీసులతో నేను వస్తాను. రెడ్ హేండెడ్ గా పట్టుకుంటే తప్ప రఘుపతి నేరాలు ఋజువుచేయడం కష్టం..."

కోమల జోగినాథం చెప్పినదంతా విని అతను చెప్పిన విధంగా నడచుకోవడానికి సిద్ధపడింది. "నిజంగా ప్రాణాలు తీసుకోవడం తెలివితక్కువ. ప్రాణాలకు తెగించిన వాళ్ళు ఆత్మహత్యకు బదులుగా సంఘంలోని కుళ్ళును బయటపెట్టే ధైర్యం ప్రదర్శిస్తే దేశానికి మేలు జరుగుతుంది" అందామె.

"బాగా చెప్పావ్. ఇప్పుడు నేను చేస్తున్నదదే-" అన్నాడు జోగినాథం.

10

"మీ గురించి చాలా విన్నాను సార్! డ్యూటీని నిర్వహించడంలో మీరుదేనికీ భయపడరని ప్రజలు కథలుగా చెప్పుకుంటూరు..." అన్నాడు జోగినాథం.

ఇనస్పెక్టర్ భానోజీరావు నవ్వి-"ఏంకావాలి నీకు?" అన్నాడు.

"మీరు వెంటనే నాతో బయల్దేరి రావాలండి. చాలా కాలంగా ఓ పెద్దమనిషి అసలు రంగును బయట పెట్టడానికి విఫలయత్నాలు చేస్తున్నాను. ఇన్నాళ్ళకు నాకో అవకాశం వచ్చింది. రఘుపతి నా చెల్లెలు కోమలను తీసుకుని వెళ్ళాడు. మీరు కలగజేసుకుంటే ఆయన అసలు స్వరూపం చూస్తారు. కలగజేసుకోకపోతే నా చెల్లెలు బ్రతుకు అన్యాయమై పోతుంది."

భానోజీ రావాట్టే చలించలేదు - "రఘుపతి అంటే ఎవరు?"

జోగినాథం, రఘుపతి గురించీ, ఆయన ఆడపిల్లలను చెరపట్టే విధానం గురించీ, తన పథకం గురించీ వివరించాడు. భానోజీరావు అంతా విని"నిన్నూ నీ వాటాన్నీ చూస్తూంటే నీ మాటలు నమ్మాలని పించడం లేదు-" అన్నాడు.

"నా మాటల్లో అబద్ధముందనిపిస్తే నన్ను జైల్లోకి తోసేయండి..." అన్నాడు జోగినాథం—"నా మాట మన్నించి మీరు నాకేసు పట్టాలి..."

ఏకళనున్నాడో భానోజీరావు అంగీకరించి—"సరే-పద! ఇది రఘుపతిగారితో వ్యవహారం. ఏమాత్రం తేడా

వచ్చినా నా పీకలమీదికొస్తుంది. నువ్వు చెప్పిన విషయం ఋజువుకాకపోతే జైల్లో పెట్టడం సంగతెలాగున్నా మక్కెలిరగదన్నేస్తాను..." అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ భానోజీరావు, నలుగురు కానిస్టేబుల్సు జోగినాథం పోలీస్ జీపులో ఎక్కారు. జీపు శరవేగంతో దూసుకుపోయి ఊరికి చివరగావున్న రఘుపతి ప్రత్యేక భవనం ముందాగింది. జోగినాథం, భానోజీరావు మాత్రం జీపు దిగారు.

వాళ్లు లోపలకు వెళ్ళేసరికి కళ్యాణి అక్కడ బయట పచార్లు చేస్తోంది. యూనిఫాంలోవున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ని చూసి ఆమె కంగారు పడింది.

"రఘుపతిగారున్నారా?" అన్నాడు భానోజీరావు.

కళ్యాణి తల ఆడించి – "చాలా అర్జంటు పనిలో వున్నారనుకుంటాను..." అంది.

"ఆయనతో్నోసారి కలవాలి..." అన్నాడు భానోజీరావు ఆజ్ఞాపిస్తున్నట్లుగా.

కళ్యాణి ఒక్కక్షణం తటపటాయించి గుమ్మందగ్గరకు వెళ్ళి ఒకమీట నొక్కింది. ఆ తర్వాత రెండునిమిషాల అనంతరం తలుపులు సన్నగా తెరుచుకున్నాయి. రఘుపతి తలుపు సందుల్లోంచి ముఖం బయటపెట్టి – పోలీస్ ఇన్‌స్పెక్టర్ని చూసి– చటుక్కున బయటకు వచ్చాడు. వచ్చేటప్పుడు తలుపులు జారగిల వేశాడు.

"ఇతని పేరు జోగినాథం. ఇతని చెల్లెలు కోమలను మీరు తీసుకు వచ్చారని ఇతనంటున్నాడు..." అన్నాడు భానోజీరావు.

"వీడూ...వీడి అవతారానికీ ఓ చెల్లెలుకూడానా?" అన్నాడు రఘుపతి. ఆయన ముఖం చాలా కోపంగా

వుంది.

"అది సరేననుకోండి. నేనూ అలాగే అనుకుంటు న్నాను. ఇంతదాకా వచ్చాను కాబట్టి, ఇతడి అభియోగంలో నిజానిజాలు తేల్చడానికి ఒక్కసారి ఈ ఇల్లు సెర్చి చేసి వెళ్ళిపోతాం. ఇతడబద్ధం చెప్పివుంటే అందుకు తగిన శిక్ష ఎలాగూ అనుభవిస్తాడు!" అన్నాడు భానోజీరావు.

"ఇట్సాల్ రైట్ - నాకో అయిదునిమిషాలు గడువివ్వండి..." అని రఘుపతి తనగదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు. భానోజీరావు అనుమానంగా ఆ తలుపుల వంకనే చూస్తూ నిలబడ్డాడు.

సరిగ్గా అయిదునిముషాల అనంతరం తలుపులు తెరుచుకున్నాయి. గదిలోంచి రఘుపతి బయటకు వచ్చాడు. ఆయన వెనుకనే ఒక యువతి కూడా బయటకు వచ్చింది.

"ఆమె నా చెల్లెలు కోమల..." అన్నాడు జోగినాథం.

"ఈమె మిస్ కోమల! ఈరోజే నా పర్సనల్ సెక్రటరీగా అపాయింటయింది." అంటూ రఘుపతి ఆ యువతిని భానోజీరావుకు పరిచయం చేశాడు. కోమల, భానోజీరావుకు నమస్తే చెప్పింది.

భానోజీరావు ఆశ్చర్యంగా కోమల వంకచూసి - "మీకు మీఅన్నయ్యకూ రూపంలోనూ వేషభాషల్లోనూ చాలా తేడావుంది...." అన్నాడు.

"నాకు అన్నయ్యెవరు?" అంది కోమల ఆశ్చర్యంగా. జోగినాథాన్ని చూపిస్తే అతన్ని తా నెప్పుడూ చూడలేదంది. అతనెవరో తనకు తెలియదంది. ఉద్యోగం కోసం తిరుగుతూంటే కళ్యాణి తననిక్కడకు తీసుకు వచ్చిందనీ - ఆ సందర్భంగానే తనకూ రఘుపతిగారికీ

అక్కడ మాటలు జరుగుతున్నాయనీ ఆమె చెప్పింది.

"చెల్లాయ్ - ఎందుకిలా మారిపోయావ్?" అన్న జోగినాథాన్ని నిరసనగా చూసి - "అబ్బా-వాసన..." అంటూ ముక్కు మూసుకుంది కోమల.

జోగినాథం తనూ ముక్కు మూసుకుని - "ఇప్పుడు జరుగుతున్న ఈ వంచన వాసన నేనూ భరించలేక పోతున్నాను..." అన్నాడు.

భానోజీరావు క్రూరంగా జోగినాథం వంక చూసి - "పద - పోలీస్ స్టేషన్‌కు పోదాం. తప్పుడు సమాచారానికి ఫలిత మెలాగుంటుందో అక్కడి రుచిచూస్తావ్" అన్నాడు.

"సార్ - మీ శిక్ష ననుభవించడానికి నేను సిద్ధంగా వున్నాను. ఇంతవరకూ నేను మీకు ఒకే ఒక తప్పుడు సమాచారాన్నిచ్చాను. నా మీద దయవుంచి మీ కింకో సమాచార మిస్తున్నాను వినండి. అది కూడా తప్పని తేలితే నన్ను మీరు ఉప్పు పాతర వేసినా బాధపడను. ఎలాగూ ఇంతవరకూ వచ్చారు. ఈ ఇంటికొడ్డో ఒక చోట ప్రభుత్వానికి పనికొచ్చే అమూల్యమైన నిధి పాతి పెట్టబడి వుంది. ఆ స్థలాన్ని నేను మీకు చూపిస్తాను.." అన్నాడు జోగినాథం.

భానోజీరావు ఆశ్చర్యంగా జోగినాథం వంక చూశాడు. అతని ముఖంలో బాధ తప్పితే భయంలేదు. జోగినాథం కళ్ళలో తేజస్సున్నట్లు భావించాడతను.

రఘుపతి - "ఆ పిచ్చాడి మాటలను మీరు లెక్క చేయకండి...." అన్నాడు. అయితే భానోజీరావు మాత్రం - "ఎలాగూ ఇక్కడికి వచ్చాను కాబట్టి అదీ చూసి వెడతాను నేను. ఇది కేవలం నా విధి నిర్వహణ.

మీరు అన్యథా భావించ కూడదు...” అన్నాడు.

రఘుపతి ఓ నిముషం ఆలోచించి - “సరే - అలాగే కానివ్వండి...” అన్నాడు.

దొడ్లో జోగినాథం పోలీసులకు చూపించిన ప్రదేశం చూసి రఘుపతి కాస్త తడబడ్డాడు. కానీ ఆ తడబాటును కప్పి పుచ్చుకునేందుకు శత విధాల ప్రయత్నించాడు.

కానిస్టేబుల్సు అక్కడ తవ్వడం ప్రారంభించారు. సరిగ్గా కొంత లోతైనా తవ్వకుండానే కానిస్టేబుల్సులో సంచలనం ప్రారంభమయింది. జోగినాథం ముఖంలో సంతృప్తి - రఘుపతి ముఖంలో తెచ్చి పెట్టుకున్న ఆశ్చర్యం ఒకేసారి వచ్చాయి.

జాగ్రత్తగా తవ్వగా ఆ గోతిలోంచి ఒక యువతి శవం బయటపడింది. శరీరం ఇంకా బాగా పాడైపోలేదు.

కళ్యాణి, కోమల 'కెవ్వు'మని అరిచారు.

“ఎవరిదీ శవం? ఇక్కడికెలా వచ్చింది?” - హుంకరించాడు భానోజీరావు. అతని కిప్పుడు వెయ్యేనుగుల బలం వచ్చింది.

“రఘుపతిని ప్రతిఘటించిన ఓ అబల. పేరు రమ...” అన్నారు జోగినాథం తాపీగా.

“ఇన్‌స్పెక్టరు గారూ - ఈ జోగినాథం గాడెవడో నాకు తెలియదు కానీ నా పరువు గంగపాలు చేయడం కోసమే వాడు కంకణం కట్టుకున్నట్లుంది. గత కొద్ది దినాలుగా వీడు నన్నిరుకులో పెట్టాలని చూస్తున్నాడు. నేనే హత్య చేస్తే వీడికి తెలిసేలా తెలిసేచోట ఎందుకు పాతిపెడతాను? నా అనుమానం - వీడే ఈ హత్యచేసి శవాన్నిక్కడ పాతిపెట్టి వుంటాడని!” అన్నాడు రఘుపతి కంగారుగా.

"ఏదైనా కావచ్చు. ఏమైనా కావచ్చు. కానీ ఇప్పు డిక్కడో కేసుపుట్టింది. దాన్ని పరిష్కరించ వలసిన బాధ్యత నాకుంది..." అన్నాడు భానోజీరావు.

రఘుపతి తన గోడును ఏకరువు పెట్టుకున్నాడు. జోగి నాథం తన నెలా యిబ్బంది పెడుతున్నదీ వివరించాడు. "ఇదివరలో రమ గురించి నా పేరున పేపర్లో ప్రకటన వేయించాడు. తర్వాత కోమలను నాపై ప్రయోగించాడు. అదృష్ట వశాత్తూ రమ అన్నయ్యా, కోమల కూడా నా సహృదయాన్నర్థం చేసుకో గలిగారు. ఇప్పుడీ శవాన్ని తీసుకొచ్చాడు, ఇవన్ని కలిపి ఆలోచిస్తూంటే _ ఏ కారణం గానో రమను వీడే హత్యచేసి, ఆ నేరాన్ని నాపై మోపాలను కుంటున్నాడని నా అనుమానం..." అన్నా డాఖరికి.

"మీ అనుమానం సముచితంగానే తోస్తున్నది..." అన్నాడు భానోజీరావు _ "కానీ అందుకేదో కారణ ముండాలి గదా! జోగినాథం మీ మీద ఎందుకు పగ బట్టాడు? అతనికి మీ రేదైనా అపకారం చేశారా?"

"ఈ జోగినాథం స్వార్థంకోసం ఎవరి మీదా పగ బట్టడు. సమాజంలోని చీడపురుగుల్ని బయట పెట్టడమే నాపని..." అన్నాడు జోగినాథం.

"ఇంతకీ ఈ శవం..."

"ఇన్‌స్పెక్టరు గారూ ఆవివరాలన్నీ నేను చెబుతాను. ఆ యువతి పేరు రమ. ఆమెను గుర్తు పట్టగలవారు దొరికే ఇంటి అడ్రసు కూడా నేను చెబుతాను. నోట్ చేసు కోండి" అన్నాడు జోగినాథం.

11

జోగినాథం సాలోచనగా పోలీస్ స్టేషన్లో కూర్చు

న్నాడు. తానొకటి తలిస్తే దైవ మొకటి తలిచాడు. రమ హత్యా నేరంతో రఘుపతిని బయట పెడదామను కుంటే — ఆ శవం బయటపడడం తన ప్రాణాలమీదకే వచ్చింది.

ఆరోజు రఘుపతి నుంచి పారిపోయి కొంతదూరం మాత్రమే వెళ్ళి తను మళ్ళీ రహస్యంగా వెనక్కు వచ్చి జరిగిన దంతా చూశాడు. శవం ఎక్కడ పాతి పెట్ట బడిందో గమనించాడు. తర్వాత ఒక లారీ సాయంతో నగరం చేరుకున్నాడు. ఈ వివరాలు తను చెప్పినా ఇప్పుడెవరూ నమ్మడం లేదు.

చౌక్కారావు, కోమలి చెబుతున్నదాన్నిబట్టి రఘు పతి పైన జోగినాథానికి అపరిమితమైన ద్వేషమున్నదని తెలుస్తోంది. అందుకు కారణం జోగినాథం స్వార్థం కాదంటే ఎవరూ నమ్మడం లేదు. కేవలం విశ్వమానవ కళ్యాణంకోసం ఒక మనిషి ఇంకో మనిషి నేరాలను బయట పెట్టడానికి ప్రాణత్యాగం వరకూ వెడతాడని ఎవ్వరూ నమ్మడం లేదు.

రమను తానెరుగనని రఘుపతి అంటున్నప్పుడు — రమ హత్య గురించి మాట్లాడిన జోగినాథమే ఆ హత్య చేసి ఉండాలని చౌక్కారావభిప్రాయపడుతున్నాడు.

రఘుపతి డబ్బుతో మనుషులనూ, వారి తెలివితేటల్నీ, ధైర్యాన్నీ, మంచితనాన్నీ సర్వాన్నీ కొనగలుగుతాడు. అటువంటివాడికి ఎదురు తిరిగాడు తను. ఆత్మహత్య చేసుకోబోయిన కోమలను తను రక్షిస్తే — ఆ కోమల తిరిగి డబ్బుకు అమ్ముడు బోయింది. తన ఛీత్కరించింది.

రమ శవం అక్కడ పాతిపెట్టబడ్డ విషయం జోగి నాథాని కెలా తెలిసింది? ఈ విషయంలో అతనిచ్చే సమా

ధానాన్నెవ్వరూ నమ్మబోవడంలేదు. సాక్ష్యాలు జోగినాథానికి వ్యతిరేకంగా పేరుకుంటున్నాయి.

"ఇప్పుడేం చేస్తావ్?" అన్నాడు భానోజీరావు.

జోగినాథం నవ్వాడు.

"పొట్టేలు వెళ్ళి కొండను ఢీకొట్టింది."

"ధర్మ బలముందన్న ధైర్యంతో."

"ప్రతి హంతకుడూ ధర్మం తన పక్షాన వుందనుకుంటాడు."

జోగినాథం మళ్ళీ నవ్వి - "నా ఆశయం మంచిది. నేను తప్పక జయిస్తాను" అన్నాడు.

"ఎలా? ఉరికంబం ఎక్కా-?"

"కాదు..." అని నవ్వాడు జోగినాథం.

12

ఓ కుర్రాడు ఆ చీటీ శాంతి చేతిలో పెట్టి తూనీగలా పారిపోయాడు.

శాంతి ఆ చీటీ చదువుకుంది. అది చొక్కారావు ఆదేశం.

అవతల వీధిలో బస్ స్టాప్ వద్ద నిలబడితే కళ్యాణి అనే అమ్మాయి ఓ టాక్సీ తీసుకుని వస్తుంది. తనందులో ఎక్కాలి. గమ్యస్థానం వద్ద చొక్కారావామెను రిసీవ్ చేసుకుంటాడు. అక్కడ ఒక కొత్త అదృష్టం వారి గురించి ఎదురుచూస్తోంది.

శాంతి ఆ చీటీ చదువుకుని బాగా మురిసిపోయింది. రమ మాయంకావచ్చు, హత్య చేయబడవచ్చు - కానీ ధనలక్ష్మి మాత్రం తమను తరుముకుని మరీ వచ్చి చేరుతోంది. రఘుపతి మూలంగా ఆర్థికంగా తమ పరిస్థితి

బాగా మెరుగుపడింది.

శాంతి త్వరగా తెమిలి బట్టలు కట్టుకుని చీటీలోవున్న ప్రకారం చేసింది. ఆ ప్రకారమే టాక్సీ వచ్చింది. టాక్సీలో కళ్యాణివుంది. శాంతి టాక్సీ ఎక్కింది.

టాక్సీ కదిలిన రెండు నిముషాలో ఆఫీసులోవున్న చౌశాక్కరావుకు ఫోన్ వచ్చింది.

“రఘుపతి ద్వారా నీ భార్య శాంతి కూడా రమకు పట్టినగతే పట్టబోతోంది. ఆమె ప్రస్తుతం ఊరిచివరవున్న రఘుపతి బంగళాకు వెళ్ళింది. త్వరగా వెళ్ళి ఆమెను రక్షించుకో...”

చౌశాక్కరావు కలవరపడి అప్పటికప్పుడు బయల్దేరి ఇంటికి వెళ్ళాడు. ఇల్లు తాళంవేసి వుండడంతో అతని కంగారు అధికమయింది. త్వరగా టాక్సీ చేయించుకున్నాడు.

అతను ఊరిచివర బంగళా చేరుకునేసరికి కళ్యాణి లోపల హాల్లో పచార్లు చేస్తోంది. చౌశాక్కరావు ఒక్క ఉదుటున ఆమెను సమీపించి – “నా భార్య శాంతి ఇక్కడకు వచ్చిందా?” అనడిగాడు.

“మీ భార్య ఎవరో నాకు తెలియదు....” అంది కళ్యాణి.

అంతలోనే అవతలిగది తలుపులు తెరుచుకున్నాయి. గదిలోంచి రఘుపతి, శాంతి బయటకువచ్చారు. చౌశాక్కరావు నక్కడ చూసి రఘుపతి తడబడ్డాడు. శాంతిని రఘుపతి పక్కన చూసిన చౌశాక్కరావు కళ్ళు ఎర్రబడ్డాయి.

‘మిస్టర్ చౌశాక్కరావ్! ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. పొరపాటున నీ భార్యను నా దగ్గరకు తీసుకు

రావడం జరిగింది. ఆయాం రియల్లీ వెరీ సారీ! ఈమె నా కూతురువంటిది. నన్ను మన్నించి వెంటనే ఇక్కణ్ణించి మీ ఇద్దరూ వెళ్ళిపోండి..." అన్నాడు రఘుపతి.

శాంతి గబగబా భర్తను సమీపించింది. ఇద్దరూ బంగళాలోంచి బయట పడబోతూండగా వాళ్ళకు ఇన్స్పెక్టర్ భానోజీరావు ఎదురయ్యాడు.

"చాలా ఆశ్చర్యం - మీరు...ఇక్కడ!" అన్నాడు భానోజీరావు.

ఏం మాట్లాడాలో తోచక నవ్వేసి ముందడుగు వేశాడు చొక్కారావు.

"ఆగండి – ఇది హత్య జరిగిన ప్రాంతం. ముద్దాయికి వ్యతిరేక సాక్షులు మీరు. ఇక్కడికెందుకొచ్చారో చెప్పి మరీ వెళ్ళండి." అన్నాడు భానోజీరావు.

చొక్కారావుకు వెంటనే ఏం చెప్పాలో తెలియలేదు. కల్పించడానికి ఆతనికేమీ తోచలేదు. ఆ కారణంగా ఆతను చటుక్కున తనకు ఫోన్ వచ్చిన విషయమూ, బయల్దేరి రావడమూ చెప్పేశాడు. శాంతికూడా తన అనుభవం చెప్పింది.

"గదిలో రఘుపతి ప్రవర్తన ఎలాగుంది?"

"ఆయన నా శీలం దోచుకోవాలనే ఉద్దేశ్యంలోనే వున్నాడు. అయితే ఆయన రఘుపతి అని తెలియగానే నేను శ్రీమతి చొక్కారావునని తెలియజేశాను. ఆయన షాక్ తిన్నట్టులిక్కిపడి నన్ను సగౌరవంగా గదిలోంచి బయటకు తీసుకొచ్చాడు" అంది శాంతి.

"జరిగింది జరిగినట్టు చెప్పండి" అన్నాడు భానోజీరావు.

"కళ్యాణి నన్ని ఇంటికి తీసుకువచ్చి ఆ గదిలోకి వెళ్ళ

మంది. అక్కడ నా భర్త వుంటాడనుకున్నాను. రఘుపతి గారు కనిపించారు. నన్ను చూస్తూనే — 'ఈ రఘుపతి గదిలోకి వచ్చి లొంగకుండా ఏ ఆడదీ ప్రాణాలతో బయటపడలేదు. మర్యాదగా లొంగి బహుమతి పుచ్చుకుని వెళ్ళిపో' అన్నాడు - ఆ తర్వాత నేను శ్రీమతి చౌకారావునని తెలిసి కంగారుపడ్డాడు'' అంది శాంతి.

''మీరు వెళ్ళవచ్చు'' అన్నాడు భానోజీరావు-''ఇలా నాతో చెప్పినట్లు ఇంకెవ్వరికీ చెప్పకండి.''

చౌకారావు, శాంతి అక్కణ్ణించి బయటపడ్డారు. దారిలో శాంతి ''ఈ రోజు చాలా పెద్దగండం గడిచింది. ఆ రోగినాథం నిజమే చెబుతున్నాడని నా కిప్పుడనిపిస్తోంది. ఒక వేళ మన రమ ఇలాంటి పరిస్థితుల్లోనే'' అని ఆపైన మాట్లాడలేక ఊరుకుంది.

భానోజీరావు లోపలకు వెళ్ళేసరికి రఘుపతి, కళ్యాణి దగ్గరగా కూర్చుని ఏవో మాట్లాడుకుంటున్నారు. ఇన్‌స్పెక్టర్ని చూసి ఇద్దరూ కంగారుగా లేచి నిలబడ్డారు.

''పెద్ద పనేమీ లేదు. రమ హత్యకేసులో మంచి సాక్ష్యం లభించనున్నదనీ ఆ సందర్భంగా ఇక్కడకు వెళ్ళమనీ నాకు ఫోన్ వచ్చింది. అలాగే బయల్దేరి వచ్చాను. సమాచారం లభించింది. ఎలాగూ వచ్చానుకదా అని మిమ్మల్ని ఓ పర్యాయం పలకరించి పోదామని ఇలా వచ్చాను. వస్తాను'' అన్నాడు భానోజీరావు.

''ఏమిటో సమాచారం?'' అన్నాడు రఘుపతి.

''కేసు స్వరూపాన్నే మార్చే సమాచారమది. రోగినాథం గత చరిత్ర విచారించాను. నిజంగానే అతడు సత్పురుషుడు. ఇప్పటికతను అయిదారుగురు దోషుల్ని న్యాయస్థానాని కప్పగించాడు. ఒక్క విషయంలోనూ

అతనికి స్వార్థం లేదు.''

రఘుపతి తడబడుతూ "బహుశా ఇది మాస్టర్ ప్లాన్ కావచ్చు. ఏదో విధంగా నామీద పగ తీర్చుకునేందుకు ముందు కొంత బ్యాక్ గ్రౌండ్ ఏర్పరచుకుంటూ వచ్చి ఇప్పటికిలా బయటపడ్డాడనుకుంటాను'' అన్నాడు.

"అదే నిజమైతే అందుకేదో బలమైన కారణముండి వుండాలి. అదేమిటో మీరే చెప్పాలి. కానీ మీరు చెప్పడంలేదు.''

రఘుపతి మాట్లాడకుండా ఆలోచనలో పడిపోయాడు.

"మీరింకా నానుంచి చాలా విషయాలు దాస్తున్నారు. మీకు స్త్రీ వ్యసనమున్న మాట నిజం. అందుకు ఆడవాళ్ళను మీరీ ప్రదేశానికి రప్పించుకునే మాటకూడా నిజం.'' అన్నాడు భానోజీరావు.

"ఇన్స్పెక్టర్! ఇది నా దురదృష్టం. మీరుకూడా ఓ పిచ్చాడి తరఫున మాట్లాడుతూ నన్నుమానిస్తున్నారు'' అన్నాడు రఘుపతి విచారంగా.

13

"చూడు కళ్యాణీ! చేసిన నేరం ఒప్పుకుంటే శిక్ష తగ్గే అవకాశముంది. రఘుపతికి తార్చబోయినందుకు కోప గించుకుని రమ నీమీదకు వచ్చింది. మీ ఇద్దరికీ కాసేపు యుద్ధం జరిగింది. ఆత్మరక్షణకోసం నువ్వామెను చంపే కావ్. అవునా?'' అన్నాడు భానోజీరావు.

"లేదు. రమ నాకు తెలియదు'' అంది కళ్యాణి.

"కానీ రమను నువ్వే చంపినట్లు ప్రబల సాక్ష్యం వుంది.''

"ఏమిటది?''

"నువ్వా హత్యను చేస్తూండగా చూసిన వ్యక్తి....''

"ఎవరా వ్యక్తి?"

"రఘుపతి."

కళ్యాణి తెల్లబోయి - "ఏమిటన్నారు?" అంది.

"ఆ హత్య నువ్వే చేశావని రఘుపతిగారు మాకు చెప్పారు."

"అబద్ధం. నేనీమాట నమ్మను."

"నమ్మకపోయినా ఫరవాలేదు. నీకు శిక్ష ఎలాగూ తప్పదు."

"రఘుపతిగారెందుకు నా మీద అలా అబద్ధం చెప్పారు?"

"నిన్ను రక్షించడంకోసమని ఆయన ప్రాణాలమీదకు తెచ్చుకున్నాడు. మీ ఇద్దరిలో ఎవరో ఒకరు హత్యచేసినట్లు మాకు రూఢి అయింది. దానిమీద ఆయన్ను నొక్కించగా అసలు విషయం బయటపెట్టి - "కళ్యాణి చాలాకాలంగా నాకు తోడుగా వుంది. అందుకే ఆమెను రక్షించాలని ఇంతకాలమూ ప్రయత్నించాను. అయినా ఫలితంలేకపోయింది ... అని బాధపడ్డారు" అన్నాడు భానోజీరావు.

"అయితే నా కర్తవ్యం నేనుకూడా నేరవేర్చాలి.... నాకు తెలిసిన నిజం నేనూ బయటపెడతాను." అంది కళ్యాణి.

రమ హత్యనాడు జరిగిన వివరాలన్నీ ఆమె చెబుతూ వుంటే భానోజీరావు టేపు చేశాడు.

"శవాన్ని పాతిపెట్టడం అయ్యేవరకూ నేనక్కడే వున్నాను. హత్య కుపయోగించిన ఆయుధం రఘుపతిగారింట్లో బెడ్రూంలో భద్రంగా దాచాడు. రమ తన మానాన్ని రక్షించుకోవడం కోసం ఆయన్ను తీవ్రంగా

గాయపరచిం. రమ శవాన్ని పాతిపెట్టడమయ్యాక నేను రఘుపతిగారికి కాసేపు మాలీసుచేశాను. ఇంచుమించు స్పృహ కోల్పోయిన స్థితిలో 2 గంట గడిపారాయన. ఆయన వంటిమీదున్న చాలా దెబ్బలు, గాయాలు ఇంకా మానలేదు. ఆ వివరాలన్నీ ఇవ్వగలను.'' అంది కళ్యాణి ఆవేశంగా.

భానోజీరావు అక్కణ్నుంచి లేచి తిన్నగా మరో చోటుకు వెళ్ళాడు. అక్కడ జోగినాథం కోమల వున్నారు.

''వెల్ మిస్టర్ జోగినాథం-అనుకున్నది సాధించావు. నీ పథకం ఫలించింది. రఘుపతిమీద కేసు పటిష్టమైంది'' అన్నాడు భానోజీరావు.

కోమల కళ్ళలో వెలుగు కనిపించింది.

''మీరు చెప్పిన వివరాలన్నీ విన్నాక రఘుపతిలాంటి వాళ్ళను బయటపెట్టడానికి మీ పథకం పనికిరాదనిపించింది. అందుకే దాన్ని తిరగేసి ముందుగానే మీ వివరాలన్నీ రఘుపతికి చెప్పేసి ఆయన అభిమానం సంపాదించుకున్నాను.

నా కారణంగా మీరు జైలుపాలవడంతో రఘుపతికి చాలా నమ్మకం కలిగింది నాపైన. ఆ నమ్మకాన్నలా కాపాడుకుంటూ ఆయనపై అనుమాన బీజాలు పోలీసుల్లో నాటడం మొదలుపెట్టాను.

ముందుగా భానోజీరావుగార్కి మీ గతజీవితంగురించి కొన్ని ఉదాహరణలిచ్చాను. అవి మీ మంచి ఉద్దేశాల నాయనకు తెలియబర్చాయి.

తర్వాత ఒక మంచి అమ్మాయి నాయనకు పంపుతానని రఘుపతికి ఆశపెట్టాను. అది ఆయన బలహీనత. శాంతి

నాయనదగ్గరకు పంపాను. ఆ విధంగా ఆయనకూ చౌక్కారావుకూ భేదాభిప్రాయాలు సృష్టించాను. ఇన్స్పెక్టర్ భానోజీరావులో ఆ విధంగా రఘుపతిపై అనుమానపు మొలికలు సృష్టించగలిగాను.

ఆ విధంగా ఇన్స్పెక్టర్ భానోజీరావుకు మీపైన బాగా నమ్మకం కుదిరి - కళ్యాణివద్ద మీరాడమన్న నాటకం ఆడాడు. పని జరిగింది'' అంది కోమల, జోగినాథంతో.

''నిన్ను నేను అపార్థం చేసుకున్న మాట వాస్తవం కానీ నీ పథకమే నన్ను కాపాడింది కోమలా! ఏమైనా ఋజువుంటేనే కదా - నిజం నిజమయ్యేది. నీకు నా ధన్యవాదాలెలా చెప్పుకోవాలో తెలియడంలేదు...'' అన్నాడు జోగినాథం.

''మనిషి చచ్చి సాధించేదేమీ లేదు. చావాలనుకున్న వారు చచ్చేటంత ప్రమాదమున్న నిజాల నెదుర్కొని బయటపెట్టడానికి ప్రయత్నించాలి. ఇది నేను మీదగ్గర నేర్చుకున్నదే-మీకే నేను ధన్యవాదాలర్పించుకోవాలి'' అంది కోమల.

''నా ఆశయాలనర్థం చేసుకోగలిగావు. అంతేచాలు. మరి వస్తాను.'' అన్నాడు బోగినాథం.

''ఎక్కడికి వెడతారు?''

''స్నానానికి!''

:- ఐపోయింది :-